క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడి మృతి

వేముల : వేములకు చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు షేక్‌హసన్ శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ మరకా శివకృష్ణారెడ్డిలు హసన్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు యోగి వేమన జయంతి

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి వృద్ధాశ్రమంలో ఆదివారం యోగి వేమన జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్‌సీడీఎస్ అధ్యక్షుడు సురేంద్ర తెలిపారు. వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ప్రజలకు 104 వైద్య సేవలు

తొండూరు : మండలంలోని కృష్ణంగారిపల్లెలో శనివారం తొండూరు పీహెచ్‌సీ డాక్టర్ అరిఫుల్లా ఆధ్వర్యంలో ప్రజలకు 104 వైద్య సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరిఫుల్లా రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. చెత్తను నిర్దేశించిన ప్రదేశంలో వేయాలని, మురుగునీరు లేకుండా చేసుకోవాలని, బహిరంగ మల విసర్జన చేయకూడదన్నారు. మరుగుదొడ్లను ఉపయోగించాలని, నీటిని వృథా చేయరాదన్నారు. అనంతరం ఇనగలూరు గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ప్రొవైడర్ సాయి దివ్య, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సమావేశాన్ని విజయవంతం చేయండి

జమ్మలమడుగు : బీసీ సంక్షేమ సమావేశాన్ని విజయవంతం చేయాలని జమ్మలమడుగు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం నాయకుడు చౌడం జోల్లుకొండయ్య, కాటా రామదాసులు తెలిపారు. శనివారం స్థానిక చౌడేశ్వరిదేవి ఆలయం ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం పది గంటలకు నాగులకట్టలోని చౌడేశ్వరి దేవాలయంలోని కల్యాణ మండపంలో నిర్వహించే సమావేశానికి జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రావు, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లింగమూర్తి, తదితరులు హాజరవుతారన్నారు. బీసీలందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ముగిసిన నవోదయ పరీక్ష



నవోదయ పరీక్షకు హాజరైన విద్యార్థులు

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీ వెంకటప్ప మెమోరియల్ ఇంగ్లీషు మీడియం పాఠశాల, అహోబిలాపురం ఉన్నత పాఠశాలల్లో శనివారం నవోదయ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఎంఈఓ చంద్రోశేఖరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయ పరీక్షలకు 418 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల కోలాహలం కనిపించింది.

కోడింగ్‌పై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఇంద్రసేనారెడ్డి

చింతకొమ్మదిన్నె : స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో హైదరాబాద్ బీవీఆర్ఐటీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల ఆచార్యులు డాక్టర్ ఎం.ఇంద్రసేనా రెడ్డి కాంపిటేటివ్ కోడింగ్ ఇన్ పైతాన్ అనే అంశంపైన శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కోడింగ్ మరియు పైథాన్ యొక్క అవశ్యకత, మిషన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మరియు డీప్ లరినింగ్ విభాగాలలో పైతాన్ కోడింగ్ తదితర విషయాలను క్షుణ్ణంగా వివరిస్తూ ఉద్యోగ అవకాశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు అన్ని రంగాలలో అన్ని విభాగాలకు చెందిన నిపుణులతో అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నామని, వీటివల్ల విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించవచ్చు అన్నారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి వెంకటసుబ్బయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి

జమ్మలమడుగు : నిరుపేదలకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంతోపాటు కిలో రెండు రూపాయల బియ్యం పథకం తీసుకువచ్చిన నాయకుడు ఎన్టీఆర్ అని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డిలె తెలిపారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు లేనట్టేనా..?

- నేటికీ తెరుచుకోని పింఛన్ల వెబ్‌సైట్
- కొత్త పింఛన్ల కోసం సచివాలయాలకు చేరిన దరఖాస్తులు
- పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- 50 ఏళ్లకు పింఛన్‌లు ఇస్తామన్న హామీ గాలికేనా..?



చిలంకూరు గ్రామంలోని సచివాలయం

ఎర్రగుంట్ల : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరి ఏడు నెలలు పూర్తవుతుంది. అయితే ఇంత వరకు కొత్త పింఛన్ల పంపిణీపై కార్యాచరణ రూపొందించలేదు. గతేడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త పింఛన్లు మంజరు చేస్తామని ప్రభుత్వ పెద్దలు అర్భాటంగా ప్రకటించారు. కానీ ఇంత వరకు ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదు సరికదా కనీసం పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ కూడా తెరవలేదు. ఈ నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా 60 ఏళ్లు నిండిన వెంటనే వలంటీర్లు దరఖాస్తు పూర్తి చేసి సచివాలయాల్లో ఇస్తే పింఛన్లు మంజురయ్యేవి. కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఎదురుచూపులు తప్పడం లేదు. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల్లో చాలా మంది అర్హులైన పింఛన్‌దారులు ఉన్నారు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ తెరచుకోకపోవడంతో వారంతా ఆశగా ఎప్పుడు వెబ్‌సైట్ తెరుస్తారా అని ఎదురు చూస్తున్నారు.

అర్హత ఉన్నా.. ఎదురుచూపులే

అర్హులైన వితంతవులు, దివ్యాంగులు, వృద్ధులు, కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకోనేందుకు సచివాలయాలకు రోజూ పదుల సంఖ్యలో లబ్ధిదారులు వెళ్తున్నారు. ప్రభుత్వం నూతన పింఛన్ల కోసం ఎలాంటి వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తుంది. కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో.? ఇంకా ప్రభుత్వం నుంచి సమాచారం లేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో పక్కాగా...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛన్ దరఖాస్తు చేసుకున్న వెంటనే అందించేవారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం పింఛన్ల వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది. దీంతో కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని భావించినవారు సచివాలయాల చూట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

200 రోజులైనా తెరుచుకోని వెబ్‌సైట్..

సార్వత్రిక ఎన్నికల నోటిపికేషన్ వచ్చిన తర్వాత ఆగిన పింఛన్ల వెబ్‌సైట్, కూటమి ప్రభుత్వం వచ్చిన సుమారు 200 రోజులు అవుతున్నా ఎందుకు తెరుచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లబ్ధిదారులకు సచివాలయా సిబ్బంది సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారు.

50 ఏళ్లకే పింఛన్ గాలికేనా...

సార్వత్రిక ఎన్నికలలో బీసీలకు 50 ఏళ్లకు పింఛన్ల ఇస్తామని చెప్పిన హామీ గాలికి వదిలేశారని బీసీ వర్గానికి చెందిన వారు ప్రశ్నిస్తున్నారు. బీసీలకు సమన్యాయం చేస్తాని చెప్పి 50 ఏళ్లకే పింఛన్ల మంజూరు చేస్తామని చెప్పిన మాటలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమైయ్యాని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. బూటకపు హామీలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందంటూ వారు వాపోతున్నారు.

పింఛన్ కోసం వెబ్‌సైట్ రాలేదు..



కొత్త పింఛన్‌ల దరఖాస్తులు కోసం ప్రభుత్వం నుంచి వెబ్‌సైట్ రాలేదు. కొత్త పింఛన్‌లు కోసం ఇప్పటికే సచివాలయాలకు దరఖాస్తులు వస్తున్నాయి. ప్రస్తుతం పింఛన్‌లపై విచారణ జరుగుతుంది. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు విచారణ చేస్తున్నాం. వెబ్‌సైట్ వచ్చిన వెంటనే కొత్త పింఛన్‌లు దరఖాస్తులను తీసుకుని ఆప్‌లోడ్ చేస్తాం

– వెంకటరమణయ్య, ఎంపీడీఓ, ఎర్రగుంట్ల

చెప్పిన హామీలను నెరవేర్చాలి



ఎన్నికల ముందు చెప్పిన హామీలను నెరవేర్చాడంలో ఈ చంద్రబాబు సర్కార్ పూర్తిగా విఫలమైంది. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్న హామీలను నెరవేర్చలేదు. పింఛన్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవడానికి ఇప్పటి వరకు వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే వలంటీర్లే ఇంటి వద్దకు పోయి పింఛన్ దరఖాస్తులు చేయించే వారు.

– జయరామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, ఎర్రగుంట్ల

బీసీలకు 50 ఏళ్లకే పింఛన్‌లు వెంటనే అమలు చేయాలి



ఎన్నికల హామీలో భాగంగా చంద్రబాబు బీసీలకు 50 సంవత్సరాల వయస్సు వుంటే పింఛన్‌లు ఇస్తామని చెప్పారు. అయితే ఇంత వరకు అమలు చేయలేదు. వెంటనే బీసీలకు చెప్పిన హామీలను నెరవేర్చాలి. అలాగే ఎస్సీ, ఎస్టీల మాదిరిగా బీసీలకు చట్ట భద్రత కల్పించాలి.

– రాధాకృష్ణ, బీసీ సంఘం నాయకులు, ఎర్రగుంట్ల

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి మూలవిరాట్

పులివెందుల టౌన్ : పట్టణంలోని పార్నపల్లె రోడ్డు సమీపంలో ఉన్న కోతి సమాధి ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఆకు పూజ, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకుని కాయకర్పూరాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

రెవెన్యూ సదస్సుల్లో ఆర్జీల పరిష్కారాలు శూన్యం

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుల్లోని ఆర్జీలపై ఇప్పటి వరకు ఏలాంటి పరిష్కారాలు చూపలేదని ఎర్రగుంట్ల ఉపమండలాధ్యక్షుడు మల్లు వెంకట మోహన్‌రెడ్డి తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం అర్భాటంగా నిర్వహిస్తున్నా వచ్చిన ఆర్జీలపై ఎలాంటి పరిష్కారాలు చూపలేదన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి



శోభా యాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చెన్నకృష్ణారెడ్డి, తదితరులు

వేంపల్లె : కడప నగరంలోని మున్సిపల్ స్టేడియంలో అయోధ్య ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణోత్సవం, శోభాయాత్రను విజయవంతం చేయాలని హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నందారపు చెన్నకృష్ణారెడ్డి కోరారు. శనివారం స్థానిక శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలోని అన్ని పురవీధుల్లో శ్రీరామ మహా శోభాయాత్ర ఉంటుందని, దాదాపు 50 రకాల సాంస్కృతిక కళా బృందాలతో, అతి పెద్ద భక్తి ఈఓ సౌండ్ సిస్టమ్స్‌తో నిర్వహించబడుతుందన్నారు. లక్షలాది మంది భక్తులతో భారతదేశ చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో జరిగే ఈ శోభాయాత్రకు ప్రతి హిందువు భాధ్యతాయుతంగా పాల్గొనాలన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున హిందువులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

యానిమేటర్ తొలగింపుపై అధికారుల ఏకపక్షం



కొత్తపల్లె సమావేశంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు

ముద్దనూరు : స్వయం సహాయక బృందాల యానిమేటర్ తొలగింపుపై సభ్యురాళ్ళ అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా సంబంధిత అధికారులు ఏకపక్షంగా వ్యవహరించినట్లు ఆరోపణలు తలెత్తాయి. శనివారం మండంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ స్వయం సహాయక బృందాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యానిమేటర్ లక్ష్మీదేవి తొలగింపుపై వెలుగు సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించారు. యానిమేటర్ తొలగింపునకు సభ్యుల అభిప్రాయాలుగానీ, ఎన్నికగానీ, తీర్మానంగానీ ప్రతిపాదించలేదని, ప్రస్తుతం వున్నయానిమేటర్‌ను తొలగించి కొత్త యానిమేటర్‌ను నియమించనున్నట్లు వెలుగు సీసీలు తెలిపారు. దీనికి సభ్యురాళ్ళు వ్యతిరేఖించారు. ప్రస్తుతమున్న యానిమేటర్‌ను తొలగించడానికి కారణాలు చెప్పాలని వాదించారు. సాధారణ సమావేశం పేరుతో యానిమేటర్ తొలగింపునకు చర్యలు తగవని, యానిమేటర్ తొలగింపుపై అందరి అభిప్రాయం తీసుకోవాలని ఎస్‌హెచ్‌జీ సభ్యులు డిమాండ్ చేశారు. యానిమేటర్ తొలగింపు విషయాన్ని వెలుగు ఏపీఎం అపర్ణ దృష్టికి తీసుకెళ్ళగా ఆమెపై కొన్ని ఆర్థిక పరమైన ఆరోపణలు వచ్చాయని, ప్రస్తుతానికి తొలగించలేదని తెలిపింది.

బాబోయ్ పొగమంచు



మిరప పంటను దట్టంగా కమ్ముకున్న మొగిలి

మైలవరం : వారం రోజులుగా అడపదడాప వస్తున్న పొగమంచు కారణంగా కంది, మిరప పంటల రైతులు లబో దిబో అంటున్నారు. పూత సమయంలో మొగిలి రూపంలో వస్తున్న మంచు పూతను కొప్పెసి దెబ్బ తీస్తుందని రైతులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట బాగున్న సమయంలో ఈ విధంగా రావడంతో రైతు దిగుబడి తగ్గిపోతుందని మిరప పంటకు బూడిద తెగులు వచ్చె అవకాశం ఉందని కంది పంట పూత రాలిపోయి సరైన విధంగా దిగుబడి రాకపోవచ్చునని రైతులు బెంబెలెత్తుతున్నారు. ప్రకృతి గత 20 రోజుల క్రితం తుపాను రూపంలో కొంత భాగం తిరిగి మొగిలి రూపంలో మరి కొంత భాగం దెబ్బ తీసిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా శ్రీత్యాగరాజస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో నాయీ బ్రాహ్మణులు

పులివెందుల టౌన్ : సంగీత విద్వాంసుడు శ్రీత్యాగరాజస్వామి ఆరాధన సందర్భంగా పట్టణంలో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం నాయీ బ్రాహ్మణులు ప్రత్యేక పల్లకిని ఏర్పాటు చేసి అందులో త్యాగరాజస్వామి చిత్ర పటాన్ని ఉంచి మంగళ వాయిద్యాలతో వీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవం స్థానిక తూర్పు ఆంజనేయస్వామి ఆలయం వరకు సాగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రీత్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు



పులివెందుల రూరల్ : మండలంలోని ఎర్రబల్లె పంచాయతీ పరిధి మల్లికార్జున గ్రామంలో రైతు అరవింద తోటల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తీగలు అల్లుకున్నాయి. ప్రమాదవశాత్తు తోటల దగ్గరికి వెళ్లిన రైతులు తీగలకు బదులుగా విద్యుత్ వైర్లు పట్టుకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న తీగలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగవు



రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ బీవీ ప్రసాద్

పులివెందుల రూరల్ : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగవని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీవీ ప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణంలోని ఎంవీఐ కార్యాలయంలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా ఆటో డ్రైవర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ అభ్యర్థులకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకుని వెళ్లరాదన్నారు. వాహనాల యొక్క పర్మినెంట్లు ఎఫ్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా డ్రైవర్ వద్దనే ఉంచుకోవాలన్నారు. అతి వేగం కూడా ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ యూనియన్ జనరల్ సెక్రెటరీలు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనపై శిక్షణ



మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా బేగం

వేంపల్లె : మండలంలోని తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ స్వాతిసాయి ఆధ్వర్యంలో శనివారం జాతీయ కుష్టు నిర్మూలనపై ఆశా వర్కర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా బేగం మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీవరకు కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వైద్య చికిత్సలు అందించాలన్నారు. అలాగే ప్రజలకు స్పర్శలేని మచ్చలు, పొడలు ఉంటే గుర్తించాలని, కుష్టు వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స చేయకపోతే తీవ్రమైన దీర్ఘకాలిక పరిణామాలు ఉంటాయన్నారు. గ్రామాల ప్రజలు ఆరోగ్య సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటరత్నం, ఎంపీహెచ్ఈఓ ఫకృద్దీన్, సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరలు లేక రైతుల గగ్గోలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మిరప పంట

మైలవరం : ఖరీఫ్ సీజన్‌లో ఎంతో ఆశతో సాగు చేసిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు గగ్గోలు పెడుతున్నారు. మిరప, మినుం, కొర్ర, తదితర పంటలకు రైతులు పెట్టిన పెట్టుబడులు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరప పంటలో వివిద రకాలుగా సాగుచేసిన అయా మిరప కాయల ధరలు అయా రకాన్ని బట్టీ వంద రూపాయల నుంచి రూ.150 మాత్రమే పలుకుతున్నాయి. మినుం పంటలకు సంబంధించి సరుకు నాణ్యతను బట్టి రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు పలుకుతోంది. దీంతో పాటు కొర్ర సాగుచేసిన రైతు పరిస్థితి అగోమ్యగోచరంగా తయారైంది. కొనుగోలు చేసే వారు అడ్డుగోలుగా అడుగుతుండటంతో విక్రయించాలా లేదో తెలియక సతమతమవుతున్నారు. ప్రస్తుతం వీటి ధరలు అయా నాణ్యతను బట్టి రూ.2 వేల నుంచి రూ.2500 పలుకుతోంది. ఏది ఏమైన ఖరీఫ్ పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక రైతు భారీ నష్టాన్ని చవిచూస్తున్నారని చెప్పవచ్చు.

పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించాలి



గండిలో చెత్తను తొలగిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు



కమలాపురంలో క్రాస్ రోడ్డు వద్ద చీపుర్లు పట్టి శుభ్రం చేస్తున్న చైర్మన్, కమిషనర్



వల్లూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డీఎల్‌పీవో విజయభాస్కర్



వేంపల్లెలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ ర్యాలీలో ఎంపీడీఓ, అధికారులు

కమలాపురం : ప్రజలు పారిశుద్ధ్య ప్రమాణాలను పాటించి నగర పంచాయతీని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరి తెలిపారు. శనివారం నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ ఆధ్వర్యంలో పట్టణంలో స్వచ్ఛ అంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. ఇందులో భాగంగా చెత్త కుండీలున్న చోట శుభ్రం చేసి మెప్మా మహిళలు రంగు వల్లులు వేసి ఆ ప్రాంతాలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. జేసీబీల ద్వారా డ్రైనేజీలను శుభ్రం చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. అలాగే క్రాస్ రోడ్డు వద్ద చీపుర్లతో రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం అక్కడే మానవ హారం ఏర్పాటు చేసి స్వచ్ఛ సర్వేశ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించి పట్టణాన్ని శుభ్రంగా ఉంచాలన్నారు. చెత్తా చెదారాన్ని కాలువల్లో వేయకుండా ఇళ్ల వద్దకు వచ్చే మున్సిపల్ ట్రాక్టర్లకు అందించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా ఎలాంటి రోగాలు వ్యాప్తి కాకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాబుల్, మెప్మా ఆర్పీలు, సీఓలు లావణ్య, ప్రజ్యోత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలనరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : పంచాయతీ పరిధిలో పారిశుద్ధ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ కులాయమ్మ తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా వేంపల్లె పంచాయతీ పరిధిలోని ప్రజలు, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవో కార్యాలయం నుంచి పురవీధుల గుండా నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లికార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అధికారులు శనివారం పురవీధులలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తామన్నారు. అనంతరం అధికారులు స్వచ్ఛ ఆంధ్రపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వ్యాధులు రాకుండా నివారించుకోవచ్చని డీఎల్‌పీవో విజయభాస్కర్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో రఘురాం పలు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను చేపట్టారు. ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. వల్లూరులో జరిగిన కార్యక్రమంలో కడప డివిజనల్ పంచాయతీ అధికారి విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, పిల్లలతో మానవహారంగా నిలబడి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. పారిశుద్ధ్య నిర్వహణ గురించి ప్రజలకు అవగాహన కలిగించారు. నెలలో ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమంను అన్ని పంచాయతీలలో నిర్వహించి పారిశుద్ధ్య పనులను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమలత, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంతో పాటు పాపాఘ్ని నదిలో ఉన్న చెత్త చెదారం పూర్తిగా తొలగించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రదాన అర్చకుడు కేసరి, మాజీ చైర్మన్ వెంకటస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన వ్యాధులకు దూరంగా ఉంటామని మండల వైద్యాధికారులు మహమ్మద్ తాహ, ఖాదర్‌బాషాలు తెలిపారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొని ప్రసంగించారు. నిత్యం మన జీవితంలో వ్యక్తిగత పరిశుభ్రత ఎలా పాటిస్తామో అలాగే పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా వారి ఇళ్లలోనే తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా చేసి చెత్త సేకరణ వాహనాలకు ఇచ్చే విధంగా గ్రామాల్లో ప్రజలను చైతన్యపరచాలని సిబ్బందికి సూచించారు. ఆంధ్ర స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో భాగంగా మండల అభివృద్ధి అధికారి చంద్రమౌళీశ్వర్, ఈఓపీఆర్‌డీ పులి రామ్‌సింగ్‌ల ఆధ్వర్యంలో ఎస్.పాలగిరి, తంగెడుపల్లె, గంగిరెడ్డిపల్లె పంచాయతీల్లో చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు సురేఖ, ఫార్మసిస్ట్ కుమారి, ల్యాబ్ టెక్నిషియన్ కిషోర్, పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రీన్ అంబాసిడర్‌లు పాల్గొన్నారు.